

25న హెచ్‌ఆర్‌సీఐ వార్షికోత్సవ సభ

నస్పూర్, మే 21: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) ద్వితీయ వార్షికోత్సవ సభ విశాఖపట్నంలోని సింహాచలంలో ఈ నెల 25న జరుగుతుందని హెచ్‌ఆర్‌సీఐ దక్షిణ భారత అదనపు ప్రధాన కార్యదర్శి బీర్‌పూరి రఘుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నరసింహారావుల అధ్యక్షతన సభ జరుగుతుందన్నారు. జిల్లా నుంచి వివిధ హోదాల్లో ఉన్న హెచ్‌ఆర్‌సీఐ కుటుంబ సభ్యులు హాజరు కావాలని, తద్వారా సభను విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, మే 21: ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. కాసిపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎస్‌కె అంకూస్ ఇటీవల వాగులో పడి మృతి చెందగా మంగళవారం మృతుడి భార్య చాంద్‌బీకి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో ప్రతీ కార్యకర్తకు పార్టీ సభ్యత్వంతోపాటు బీమా సౌకర్యం కల్పించిందన్నారు. కార్యకర్తల కుటుంబాన్ని అన్ని విధాలుగా పార్టీ ఆదుకుంటుందన్నారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతీ కార్యకర్త అంకితభావంతో పని చేయాలన్నారు. జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, మాజీ సర్పంచు ఆడె బాదు, మాజీ ఉపసర్పంచు తిరుపతియాదవ్, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, నాయకులు భీమయ్య, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

జైపూర్, మే 21: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం ఇందారం, కుందారం, గంగిపెల్లి, దుబ్బపల్లి, వెంకట్రావుపల్లె గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో పాఠశాలలు ప్రారంభమవుతాయని, ఇందుకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ శశాంక్‌రెడ్డి ఉన్నారు.

మందమర్రిరూరల్: అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సారంగపల్లి, అందుగులపేట పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కంటే ముందే పనులను పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం కుట్టు కేంద్రాలను పరిశీలించి విద్యార్థులు యూనిఫాంలను త్వరగా అందించాలని సూచించారు. ఏపీఎం లలితకుమారి, సీసీ చారి పాల్గొన్నారు.

అటవీ ట్రెంచ్ పనులను అడ్డుకున్న గ్రామస్థులు



ట్రెంచ్ పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

భీమారం, మే 21: మండలంలోని పోలంపల్లి గ్రామపంచాయతీలోని అంకుశాపూర్ శివారు సర్వే నెంబరు 140లో అటవీ శాఖ అధికారులు ట్రెంచు పనులను చేస్తుండగా మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 140లో పోడు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఈ భూమి దళిత పేద కుటుంబాలకు చెందిందన్నారు. గత ప్రభుత్వం పోడు పట్టాలను కొందరికి అందించిందన్నారు. ఫారెస్టు అధికారులు భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని తెలిపారు. భూమిలో చెరువు ఉందని, దీన్ని సైతం ఫారెస్టు అధికారులు వదలకుండా ట్రెంచ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. మంచిర్యాల ఫారెస్టు రేంజ్ అధికారి రత్నాకర్ రావును వివరణ కోరగా అంకుశాపూర్ శివారులోని సర్వే నెంబరు 140లోని భూమి కుందారం రిజర్వు ఫారెస్టులోని కంపార్టుమెంట్ నెంబర్ 50లోదని, విధి నిర్వహణలో భాగంగా అటవీ హద్దు చుట్టూ ట్రెంచ్ పనులను నిర్వహిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారన్నారు. రెవెన్యూ, ఫారెస్టు జాయింట్ సర్వేతో భూమి విషయం తేలుతుందని తెలిపారు. రైతులు దర్శనాల రమేష్, నరేందర్, రాములు, శ్రీహరి,రామ్మోహన్, మధుకర్ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు

- కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు



గోపమ్మకు బియ్యం అందజేస్తున్న సీఐ

ఏసీసీ, మే 21: తల్లిని కొడుకులు ఇంటి నుంచి గెంటివేసిన సంఘటన మంచిర్యాల పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. సామంతుల గోపమ్మ ఐదుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వృద్ధురాలి భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. గోపమ్మ తనకున్న భూమిని కొడుకు లకు పంచి ఇచ్చినప్పటికీ వారు తల్లి సంరక్షణను పట్టించుకోకుండా ఇంటి నుంచి గెంటివేశారు. గోపమ్మ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు గోపమ్మ కొడుకులను, కోడళ్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి వృద్ధురాలి సంరక్షణను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసినా, ఇంటి నుంచి గెంటివేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇకపై అలా చేయమని తల్లిని తీసుకెళ్లారు. పట్టణ సీఐ బన్సీలాల్ గోపమ్మకు పోలీసుల తరుపున 25 కేజీల బియ్యం అందించారు.

మేత గోస



చెరువు పక్కన మేస్తున్న గేదెలు

- మూగజీవాలకు పశుగ్రాసం కొరత
- చుక్కలనంటుతున్న గడ్డి ధరలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

నస్పూర్, మే 21: పశుగ్రాసం కొరతతో రైతులకు పశువుల పోషణ భారంగా మారుతోంది. ఆరుబయట మేత లభించక మూగ జీవాలు తల్లడిల్లిపోతున్నాయి. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా పశుగ్రాసం దొరకని దుస్థితి నెలకొంది. గడ్డి ధరలు కూడా ఆకాశన్నంటాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా గడ్డి సమస్య అన్నదాతను వెంటాడుతోంది. పశువులకు వేసే పచ్చిగడ్డి, తిండి గింజలు, పశుగ్రాసం కొరతతోపాటు నీటి సమస్య ఎదురవుతోంది. జిల్లాలో ఆవులు, ఎద్దులు 2.10 లక్షలు, గేదెలు లక్షా 5 వేలు, గొర్రెలు 5.20 లక్షలు, మేకలు 2.30 లక్షలున్నాయి.

● తగ్గిన గ్రాసం ఉత్పత్తి

జిల్లాలో వరి లక్ష ఎకరాలు, మొక్కజొన్న 260 ఎకరాలు, జొన్న 120 ఎకరాలు, పెసర 20 ఎకరాలు, కంది 20 ఎకరాల్లో సాగు చేస్తారు. పశు సంపదకు సరిపడిన గ్రాసం ఉత్పత్తి కాకపోవడంతో గ్రాసం కొరత ఏర్పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సాగు తగ్గడం కూడా ఒక కారణం. పశుగ్రాసం కొరత కారణంగా పశుపోషణ భారంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సీజన్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దాదాపు 200 మెట్రిక్ టన్నుల పచ్చి గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎకరానికి 20 కిలోల గడ్డి విత్తనాలను సాగు చేయవచ్చని, ఫలితంగా రైతుకు పశుగ్రాసం కొరత తీరుతుందని పేర్కొంటున్నారు.

● గ్రాసం కోసం తిప్పలు...

పాడి పశువులను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుకు కొంత ఆదాయాన్ని ఇచ్చే పాడి సంతతి తగ్గిపోతోంది. ఇప్పటికే పశువుల సంఖ్య తగ్గుముఖం పట్టగా మిగిలిన కొద్ది పాటి పశువులకు గ్రాసం కొరత పట్టిపీడిస్తోంది. మూగజీవాలను సాకడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. పశువులు దాహార్తి తీర్చలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● భగ్గుమంటున్న ధరలు

రైతులు పశుగ్రాసం కొనుగోలు చేద్దామంటే ధరలు భగ్గుమంటున్నాయి. చేన్లు చేలుక నుంచి అటు ఇటు తిరిగొచ్చిన పశువులకు కనీసం నీటి వస తిని అందించలేని పరిస్థితిలో నెలకొంది. వరి గడ్డి ట్రాక్టర్ లోడు రూ.4000 నుంచి 4500 వరకు, ఎడ్ల బండి గడ్డి రూ.2500 నుంచి 3000 వరకు, మొక్క జొన్న, జొన్న కట్ట రూ.50 నుంచి 60 వరకు, పచ్చి గడ్డి మోపు రూ.75 నుంచి 80 వరకు, పెంచుతున్న పచ్చి గడ్డి గుంట విస్తీర్ణంకు నెలకు రూ.1200 రూపాయలకు లభిస్తోంది. పాల వ్యాపారం చేసే వారు రోజు గేదెలకు, ఆవులకు పచ్చి గడ్డి వేస్తారు. సరైనా తిండి లభించకపోతే పాల దిగుబడి పడిపోతుంది.

పశుగ్రాసం కోసం ఇబ్బందులు
బొలిశెట్టి తిరుపతి, నర్సింగపూర్



పశుగ్రాసం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వేసవి వచ్చిదంటే పశుగ్రాసంతోపాటు నీటి సమస్య ఉంటుంది. పచ్చి గడ్డి ఎండు గడ్డి కొనాలంటే ధరలు అధికంగా ఉన్నాయి. గడ్డితో పాటు ఇతర దాణ పెడుతున్నాం. గేదెలను గోదావరి ఒడ్డున, చెరువు కింద ఉన్న పొలాల్లో అక్కడక్కడ ఉన్న గడ్డి పోచలు తింటున్నాయి.

పశుగ్రాసం విత్తనాల పంపిణీ
శంకర్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

జిల్లాలో పశుగ్రాసం కొరత రాకుండా రైతులకు ఇప్పటివరకు 200 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను పంపిణీ చేశాం. ఎకరాకు 20 కిలోల గడ్డి విత్తనాలను చల్లి గడ్డిని పెంచుకునే అవకాశం ఉంటుంది. జిల్లా పశుగ్రాసం కొరత లేదు.



వరి గడ్డి కట్ట

నెలాఖరులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 21: ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ అధికారి కృష్ణఆదిత్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల, కుమరంభీంఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌లు బదావత్ సంతోష్, వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, దాసరి వేణులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, నాణ్యమైన ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీరు, ఇతర సదుపాయాలతోపాటు ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవసరమైన టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోళ్ల వివరాలను రిజిష్టర్లలో నమోదు చేయాలని, కొనుగోలు కేంద్రానికి కేటాయించిన లక్ష్యం వంద శాతం పూర్తయితే వివరాలు సమర్పించి ఆ కేంద్రాన్ని మూసివేయాలని, ఆ కేంద్రంలోని సామగ్రిని అవసరం ఉన్న కేంద్రాలకు తరలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 136, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 89, మెప్మా ఆధ్వర్యంలో 10, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 51 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నామ న్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ అధికారి కృష్ణఆదిత్య

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

నస్పూర్: ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశించారు. నస్పూర్ పట్టణం సీతారాంపల్లి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బదావంత్ సంతోష్, అదనపు కలెక్టర్ మోతిలాల్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌లతో కలిసి తనిఖీ చేశారు. కేంద్రంలో కొనుగోలు చేసిన, చేయాల్సిన వివరాలను తెలుసుకున్నారు. సత్వరమే కొనుగోలను చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. బెల్లంపల్లి ఆర్డీవో, ఇన్‌చార్జి పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ సంతోష్, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

జైపూర్: ధాన్యం కొనుగోలు ప్రక్రి యను త్వరగా పూర్తి చేసే విధం గా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశించారు. రామారావుపేట కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి తనిఖీచేశారు. ట్యాగింగ్ చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు.



సీతారాంపల్లి కొనుగోలు కేంద్రంలో రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కలెక్టర్

జిల్లాలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, మే 21 : జిల్లాలో మంగళవారం 43.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాసిపేటలో 43.4, జన్నారంలో 42.8, దండేపల్లిలో 42.1, నస్పూర్‌లో 42.0, బెల్లంపల్లిలో 41.8, చెన్నూరులో 41.5, హాజీపూర్‌లో 41.2, భీమారంలో 41.1, వేమనపల్లిలో 40.8, భీమిని, మంచిర్యాలలో 40.6, నెన్నెలలో 40.5, లక్సెట్టిపేటలో 40.3, మందమర్రి, తాండూర్‌లో 40.0, జైపూర్, కన్నెపల్లిలో 39.9, కోటపల్లిలో 39.3 డిగ్రీలు నమోదయ్యాయి.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

చెన్నూరు, మే 21: అక్కెపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కలెక్టరేట్ ఎదుట యాదవ కులస్తుల నిరసన



నస్పూర్, మే 21 : ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించినా గొర్రెలు పంపిణీ చేయలేదని యాదవ కులస్తులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 83 మంది ఒకొక్కరం రూ. 43,750 చొప్పున డీడీలు చెల్లించినా నేటికీ గొర్రెలు రాలేదని భీమిని మండలం చిన్న గుడిపేట గ్రామానికి చెందిన పలువురు యాదవులు పేర్కొన్నారు. డీడీలు చెల్లించి గొర్రెలు వస్తాయని ఎదురు చూస్తున్నామని వారు తెలిపారు. ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. డీడీలు కట్టిన లబ్ధిదారులకు గొర్రెలు లేదా డీడీలు వాపస్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు తులా మధుసూదన్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ. 43,750 రూపాయల డీడీలను కట్టించిందన్నారు. 2022లో డీడీలు చెల్లించగా 18 నెలల నుంచి ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నేటికి గొర్రెలు అందలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి యాదవులకు న్యాయం చేయాలని కోరారు. లబ్ధిదారులు బీరయ్య, రాజ్ కుమార్, రాచ బీరయ్య, మల్లయ్య, ఐలయ్య, దాస్య, బోసు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



డిప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, మే 21 : బెల్లంపల్లి నియోజకవర్గంలో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు విన్నవించారు. మంగళవారం సచివాలయంలో డిప్యూటీ సీఎంను కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు నష్టపోయారని వారిని ఆదుకోవాలని కోరారు.

బాలిక మృతిపై వైద్యాధికారి విచారణ



బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యాధికారి

నెన్నెల, మే 21: ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలిక మృతి చెందిన ఘటనపై నెన్నెల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. నెన్నెలకు చెందిన కొమ్మెర పల్లవి (12) వేమనపల్లి మండలం కేతనపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. కడుపు నొప్పితో బాధపడడంతో ఆర్ఎంపీ సంతోష్ వద్దకు తీసుకెళ్లారు. ఇంజక్షన్ వేయడంతో వికటించి అస్వస్థతకు గురికాగా మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆర్ఎంపీ ఇంజక్షన్ చేయడం వల్లే పల్లవి మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఆర్ఎంపీ ఏం వైద్యం చేశారు. ఇంజక్షన్ చేసిన ఎంత సేపటికి అస్వస్థతకు గురైంది తదితర అంశాలపై వాకబుచేశారు. నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేస్తామని మెడికల్ ఆఫీసర్ చెప్పారు. సూపర్‌వైజర్ వసుమతి, మల్లేశ్వరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రైవేట్ క్లినిక్‌లు తనిఖీ : స్థానిక ప్రైవేట్ క్లినిక్‌లను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ తనిఖీ చేశారు. వారు వాడుతున్న మందులను పరిశీలించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, స్టెరాయిడ్స్, యాంటిబయటిక్స్ వాడకూడదని సూచించారు. పరిమితికి మించి వైద్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పులులకు రక్షణేది?



అధికారులు స్వాధీనం చేసుకున్న చిరుత పులి చర్మం (ఫైల్)

జైపూర్ అడవుల్లో సంచరిస్తున్న చిరుతపులి
వేటగాళ్లతో పొంచి ఉన్న పెను ప్రమాదం
తాజాగా కోటపల్లిలో చిరుత చర్మం పట్టివేత

మంచిర్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. వేటగాళ్ల విద్యుత్ కం చెలు, ఉచ్చులకు అవి బలవుతున్నాయి. పులుల రక్షణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, అటవీ శాఖ వాటి ప్రాణాలను కాపాడలేకపోతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో పులుల కదలి కలను గమనించేందుకు సీసీ కెమెరాలు, యాని మల్ ట్రాకర్స్ ఏర్పాటు చేసినా లాభం లేకుండా పోతోంది.

వేటగాళ్ల ఉచ్చులకు బలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేటగాళ్లు విద్యుత్ కంచెలు, ఉచ్చులు ఏర్పాటు చేసి వన్యప్రాణులను వేటాడుతున్నారు. 2019లో ఇచ్చోడ పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో పులి చర్మం పట్టుపడగా అదే సం వత్సరం జనవరి 14న మంచిర్యాల జిల్లా కేంద్రానికి సమీపంలో చిరుత మృత్యువాత పడింది. రంగంపేట సమీపంలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో చిక్కి చిరుత ప్రాణాలు కోల్పోయింది. 2016 ఏప్రిల్‌లో ర్యాలీ గుట్టల్లో వేటగాళ్ల ఉచ్చులో చిరుత పులి చిక్కి మరణించగా గోళ్లు దొంగిలించిన నిందితులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. అదే సంవత్స రం డిసెంబరు 3న కోటపల్లి మండలం పిన్నారం అటవీ ప్రాంతంలో వేటగాళ్లు వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి పులి మరణించిం ది. నిందితులు పులి కళేబరాన్ని ఒర్రెలోని ఇసుకలో పూడ్చిపెట్టగా ఆలస్యంగా వెలుగు చూసింది.

ఆ పులులు ఆచూకీ ఏది..?

2012 ఏప్రిల్ 10న కవ్వాల అభయారణ్యాన్ని టైగర్ జోన్‌గా ప్రకటించాక అడపాదడపా పులులు ఇక్కడికి వస్తున్నాయి. కొన్నాళ్లకే పులులు అగుపించకుండ పోతున్నాయి. 2016 నవంబర్‌లో కనిపించిన పులి, డిసెంబరు 3న కోటపల్లి మండలం పిన్నారం అడవుల్లో వేటగాళ్ల ఉచ్చు కు బలైంది. 2015లో నీల్వాయి, చెన్నూరు, కుశ్నపల్లి అడవుల్లో మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ ఆడ పులి మూడు నెలలపాటు సంచరించింది. 2020లో బ్రాహ్మణపల్లి అడవుల్లో మరో పులి కనిపించింది. అది ఏమైందో ఎవరికీ తెలియదు. ఈ క్రమంలో పట్టుబడుతున్న పులి చర్మాలు పులుల రక్షణపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. 2015లో చెన్నూరు మండలం పల్లుల, కోటపల్లి మండలం బబ్బెరచెల్క, అన్నారం గ్రామాలకు చెందిన కొందరి నుంచి అమ్మకానికి సిద్ధంగా ఉన్న పులి చర్మాన్ని చెన్నూరు అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదే సంవత్సరం మహా రాష్ట్రలో రెండు చిరుత పులుల కాల్చివేత కేసులో భీమిని మండలానికి చెందిన ఓ వ్యక్తి ఉన్నట్లు అక్కడి అధికారులు ధ్రువీకరించారు. 2018లో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన రౌతు శ్యాంరావు పెద్దపులి చర్మాన్ని తరలిస్తూ లక్సెట్టిపేట పోలీసులకు పట్టుబడ్డాడు. బెజ్జూరు ఫారెస్టు రేంజ్‌లో మాయమైన పులి చర్మాన్ని అదే ఏడాది జనవరి 14న కాసిపేటలో పోలీసులు కనుగొన్నారు. అటవీ అధికారులకు లభ్యమైన అవశేషాలు ఆడపులి కే-4 కు చెందినవిగా సమాచారం. బెల్లంపల్లిలో పులి అవశేషాలు పట్టుబడటం, కే-4 ఆచూకీ ఐదు సంవత్సరాలుగా లభ్యం కాకపోవడంతో హత్యకు గురైంది ఆ పులేననే అధికారులు నిర్ధారణకు వచ్చారు. తాజాగా ఈ నెల 20న కోటపల్లి వద్ద చిరుతపులి చర్మాన్ని అమ్మకానికి తీసుకెళ్తున్న ఇద్దరు మహారాష్ట్ర వాసులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, అటవీ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ పులినైనా కాపాడుతారా...?

జైపూర్ మండలం కుందారం, జైపూర్ క్రాస్ రోడ్డు అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందని అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ తెలిపారు. కుందారం సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్ వద్ద చిరుత పాదముద్రలు గుర్తించామని తెలిపారు. చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో పంట పొలాలకు కరెంటు తీగలు పెట్టవద్దని, పులికి హాని కలిగించే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు. వేటగాళ్ల బారిన పడకుండా అటవీశాఖ రక్షణ చర్యలు చేపట్టి పులిని కాపాడాలని కోరుతున్నారు.



కుల జన గణనను వెంటనే చేపట్టాలి

చెన్నూరు, మే 21 : రాష్ట్రంలో కుల జన గణన ను చేపట్టి బీసీలకు న్యా యం చేయాలని మంగళవా రం బీసీ కుల సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిప త్రం అందించారు. బీసీ సం ఘం నియోజకవర్గ ఇ న్‌చార్జి మారుతి మా ట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కుల జన గణన చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పారని, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. రిజర్వేషన్‌లు ఖరారు చేసిన తర్వాతనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు గుండేటి మధు, గణేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న బీసీ సంఘం నాయకులు

కిరిటీ కుటుంబానికి అండగా ఉంటామన్న సీఎండీ

పరామర్శించిన డైరెక్టర్లు

గోదావరిఖని, మే 21: విజిలెన్స్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న జైపూర్ విద్యుత్ కేంద్రం ఎస్ఈ కిరిటీ కుటుంబానికి అండగా ఉంటామని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని టీచర్స్‌కాలనీలో నివాసముంటున్న కిరిటీ తల్లిదండ్రులు రఘురామయ్య, కాశీఅన్నపూర్ణమ్మలను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరుపుతామన్నారు. కాగా డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్(ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్‌లు టీచర్స్‌కాలనీకి వెళ్లి కిరిటీ కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దొంగ అరెస్ట్

రామకృష్ణాపూర్, మే 21: గద్దెరాగడి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తిని పట్టుకొని విచారించగా అతని వద్ద బంగారు ఆభరణాలు, కమ్మల బుట్టాలు, మాటీలు, పట్టగొలుసులు, మూడు జతలు ఉన్నాయని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన నదీమ్ అనుసరి మంచిర్యాలలోని తిలక్‌నగర్‌లో ఉంటున్నట్లు తెలిపారు. ఈ నెల 19న కేతనపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఒక ఇంట్లో బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. లక్షెట్టిపేట మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ అంకయ్య, జంగు, కానిస్టేబుల్ సునీల్, వెంకటేష్, మల్లేష్‌లను సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సైలు అభినందించారు.

బీజేపీ విజయం సాధించాలని కారు యాత్ర

ఏసీసీ, మే 21: నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం సాధించాలని జిల్లా కేంద్రానికి చెందిన ఆర్య వైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొద్దుకూరి కిరణ్‌కుమార్ కారు యాత్ర చేపట్టారు. మంగళవారం ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో కారు యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా కమల వికాసాన్ని కాంక్షిస్తూ చేపట్టిన ఈ యాత్ర జూన్ 4న కేథార్‌నాథ్‌లో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో కిరణ్‌కుమార్‌తో పాటు సురేష్, వినోద్, నవీన్, వేణు పాల్గొంటున్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

నస్పూర్, మే 21 : నస్పూర్ గేట్ ప్రాంతానికి చెందిన విద్యార్థి ముదుమాల సాయి బ్రహ్మేశ్వర్ ఈ నెల 19న గోవా ఇంటర్‌నేషనల్ మార్షల్ ఆర్ట్స్ అండర్-16 చాంపియన్ షిప్-2024 లో ప్రతిభను కనబరిచి సిల్వర్ మెడల్‌ను సాధించాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు. సాయి బ్రహ్మేశ్వర్ ట్రినిటి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థిని పలువురు అభినందించారు.

వైభవంగా నరసింహ జయంతి ఉత్సవాలు

- ముగిసిన నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 21: ధర్మపురి క్షేత్రంలో శ్రీ నరసింహ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసకపూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. పంచోపనిషత్తులతో మన్యసూక్తం, నున్నాల వన్నము, రుద్రంతో అభిషేక పూజలు, విశేష పూజలు, పంచోపనిషత్తులో అభిషేకం, సహస్ర నామార్చన, హారతి, వేద మంత్ర పుష్పం, చతుర్వేద అవధార్యాలు, ప్రత్యేక పూజలు, సప్త హారతులు నిర్వహించారు. సాయంత్రం వేళలో స్థంబోద్భవ కాలంలో విశేష పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాలకు, శ్రీ స్వామి వారలకు, దేవాలయాలకు ప్రత్యేక పూల అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నిత్యం మూడు వాటర్ కూలర్స్‌తో పాటు అదనంగా మరో రెండు చోట్ల లడ్డూ కౌంటర్ ముందు, దేవాలయం ఎదుట చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోదావరిలో స్నానాలు చేసిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



ఆలయం వద్ద భక్తులు

మల్యాల, మే 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవుల నేపథ్యంలో సోమవారం రాత్రికే వేలాదిగా కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య ఇతర అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. కాగ కొండపైన అలిశెట్టి విష్ణు అనే భక్తుడు సెల్‌ఫోన్, నగదుతో కూడిన బ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తన సిబ్బందితో వెతికి భక్తునికి అప్పగించారు.

















వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పట్టుబడిన వ్యాన్

మందమర్రిటౌన్, మే 21 : పట్టణంలోని రాష్ట్రీయ రహదారి టోల్‌గేట్ వద్ద మంగళవారం జగిత్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్‌ఐ ఉపేందర్‌లు సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా వ్యాన్‌లో రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. వ్యాన్ డ్రైవర్ మహమూద్ అలీని విచారించామన్నారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన శంషీర్ అనే వ్యక్తి జగిత్యాల జిల్లాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నాడని తెలిపారు. బియ్యాన్ని, వ్యాన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ రూ. 4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. మహమూద్ అలీ, శంషీర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

మందమర్రిటౌన్, మే 21: పట్టణంలోని ఎర్రగుంటపల్లెకు చెందిన మేకల కొమురయ్య (60) గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కొన్ని రోజులుగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడం, దివ్యాంగుడు కావడంతో మనస్తాపం చెంది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఉంది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటిక పట్టివేత



నిందితునితో ఎక్సైజ్ అధికారులు

హాజీపూర్, మే 21: మండలంలోని రాపల్లి స్టేజీ వద్ద అక్రమంగా తరలిస్తున్న గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను మంగళవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురవయ్య తెలిపారు. లక్సెట్టిపేట వైపు నుంచి మంచిర్యాలకు వాహనంలో ఒక వ్యక్తి గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రాపెల్లి స్టేజీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో 11 బ్యాగులు లభించాయని తెలిపారు. అందులో పది బ్యాగుల్లో 450 కిలోల గుడుంబాకు ఉపయోగించే బెల్లం, ఒక బ్యాగులో 10 కిలోల పటిక ఉందన్నారు. వాహన డ్రైవర్‌ను వైద్య వేణును అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశామన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట నిందితున్ని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎస్‌ఐ శంకర్, సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, మహేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మందమర్రిటౌన్, మే 21 : కేకే 5 గనికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. కొన్ని రోజులుగా గుంతలు పడి అధ్వాన్నంగా మారడంతో గుర్తింపు సంఘం నాయకులు సింగరేణి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు పనులను సింగరేణి అధికారులు ప్రారంభించారు. వే బ్రిడ్జి నుంచి గని వరకు రోడ్డును నిర్మించనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మందమర్రిరూరల్, మే 21: ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆదిల్‌పేట గ్రామ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను జెడ్పీటీసీ వేల్పుల రవి ఆధ్వర్యంలో దహనం చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్న, దొడ్డు ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి రైతులను మోసం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్‌ప్రభుత్వ హయాంలో రైతులందరికి అనేక సంక్షేమ పథకలు అమలు చేశామన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ నసీరొద్దీన్, వైస్ ఎంపీపీ లౌడం రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను చెన్నూరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేష్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరవిందరావు, జెడ్పీటీసీ సునీతతిరుపతి, ఎంపీటీసీ రవి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్ రావు

భీమిని, మే 21: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు, హరితహారం నర్సరీలు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, క్రీడా ప్రాగణాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అన్నీ గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలన్నారు, వర్మీ కంపోస్టు తయారీ నిరంతరంగా జరగాలని, హరితహారం నర్సరీల్లో మొక్కలు లేని బెడ్స్‌లో తిరిగి మొక్కలు నాటాలని, శ్మశాన వాటికల్లో పిచ్చిమొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచి నీటి వసతి కల్పించాలని, పల్లె ప్రకృతి వనాల్లో, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు నిరంతరం నీరు పట్టాలన్నారు. అసైన్డ్ భూముల్లో ఇంటి అనుమతులు ఇవ్వరాదని సూచించారు. ఎంపీడీఓ గంగామోహన్, డీఎల్‌పీఓ షేక్ సఫ్దార్ అలీ, ఏపీఓ భాసర్ రావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సెగ్రిగేషన్ షెడ్ల పరిశీలన

జైపూర్, మే 21: సెగ్రిగేషన్ షెడ్లను ఎంపీవో అనిల్‌కుమార్ సందర్శించారు. నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు కథనం ఈనెల 15న ఆంధ్రజ్యోతి ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు మంగళవారం స్పందించారు. కంపోస్టు షెడ్‌లో కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. కంపోస్టు పిట్‌లో వానపాములు వేయాలని, కంపోస్టు ఎరువుల తయారీ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని కార్యదర్శులకు సూచించారు. కంపోస్టు ఎరువును విక్రయించి నగదును గ్రామపంచాయతీ సాధారణ నిధిలో జమ చేయాలని సూచించారు. రోడ్లపై ప్లాస్టిక్, చెత్తా, చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి


బెల్లంపల్లిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, మే 21: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అప్జల్, నాయకులు నాతరి స్వామి, చిన్నరాజం, శారద, మల్లేష్, మంగ, రాము, రమేష్, శ్రీనివాస్, రాజారత్నం, రాయలింగు, పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మోహన్‌రెడ్డి, రియాజోద్దీన్, పసివుల్లా, రమేష్, ఇందయ్య, బాపన్న, రాజేష్, రజాక్, గోపి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. టీపీసీసీ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రం సాగర్‌రెడ్డి, అఫ్జల్ లాడెన్, అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రగతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు మంద తిరుమల్, నామిని ముత్తయ్య, పాషా, రాజు, అనిల్, నర్సింగ్, కిరణ్, జావేద్‌ఖాన్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాసిపేటలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్దం తిరుపతి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాజేశం, పోశం, శంకర్, వెంకటేష్, శివపాల్గొన్నారు.

మోడల్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి,మే 22 లింగాపూర్‌లో తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అనీలా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి పరీక్షలో పాసైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో 40 మంది చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రవేశం కోసం ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీటు కేటాయిస్తామన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

కాసిపేట, మే 21 : మండలంలోని ముత్యంపల్లి పంచాయతీలోని గుండ్లపాడ్, దుబ్బగూడెంలలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మంగళవారం ఆదివాసీ సేన నాయకులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేన వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, వెంకటేష్, రాము, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్

కాసిపేట, మే 21: వర్షాకాలం ఆరంభంలో పశువులకు వచ్చే వ్యాధుల నియంత్రణకు ముందస్తుగా ప్రణాళికలు చేపట్టాలని జిల్లా పశువైద్యాధికారి రమేష్ సూచించారు. మంగళవారం పశువైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముందు కురిసే వానలు పశువులకు ప్రమాదకరమైనవని, మూగ జీవాలు మురుగు నీరు తాగి మృతిచెందే అవకాశాలుంటాయన్నారు. వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి శిబిరాలను నిర్వహించాలని సూచించారు. గుండెవాపు, జబ్బవాపు, గొర్రెలకు చిటుకు రోగాలు వ్యాపించే అవకాశం ఉందని, ముందస్తుగా వీటి నివారణకు టీకాలను వేయాలని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రికి కొత్త భవనం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండల పశువైద్యాధికారి తిరుపతి, సిబ్బంది శ్యాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, మే 21 : సారంగపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద ఏఈవో ముత్యం తిరుపతి రైతులకు నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రంలో 6200 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. అనంతరం వేసవి దుక్కులు, పచ్చిరొట్ట విత్తనాల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు కమల్ మనోహర్‌రావు, ఫిరోజ్, మహేందర్, సతీష్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అక్రమాలు

- రూ.45 లక్షలు దారి మళ్లించిన సిబ్బంది
- రూ.10లక్షలు రికవరీ
- మిగితా సొమ్ము వసూలుకు రైతుల డిమాండ్


దహెగాం పీఏసీఎస్ కార్యాలయం

దహెగాం, మే 21: దహెగాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో అక్రమాల చిట్టా బయటపడింది. అధికారులు, కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కయి ఏకంగా రూ.45లక్షలు అక్రమాలు పాల్పడ్డారు. గతంలో మ్యానువల్ పద్ధతి ద్వారా లావాదేవీలు కొనసాగాయి. కాగా మూడేళ్ల క్రితం ఆన్‌లైన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో అక్రమాల దందా వెలుగు చూసింది. పీఏసీఎస్ సీఈఓ బక్కయ్య, సిబ్బంది తుమిడి నారాయణ, జీవన్ కుమార్, ఎన్‌సాయిలు కుమ్మక్కయి రూ.45లక్షలు దారి మళ్లించారు. పీఏపీఎస్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తారు. ఇందులో ప్రధానంగా వరి, కందులు, శనిగలు, సోయాబీన్ తదితర విత్తనాలు రైతులకు అందజేస్తారు. దీని కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. ఈ డబ్బులను సంబంధిత మార్క్‌ఫెడ్ సంస్థలో క్రెడిట్ చేయాల్సి ఉంటుంది. కాగా రైతుల నుంచి డబ్బులు వసూలు కాలేదని బుకాయించి సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారు. 2021 నుంచి 2023 వరకు ఆడిట్ జరగడంతో అక్రమాల విషయం వెలుగు చూసింది. ఇన్నాళ్లు మ్యానువల్ పద్ధతి ద్వారా ఏకౌంటు ప్రక్రియ కొనసాగింది. కాగా 2021 నుంచి క్రయ, విక్రయాలు ఆన్‌లైన్ చేస్తుండటంతో ఎంత మంది రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేశారన్నది తేలింది. ఈ లెక్కలు తీస్తే సుమారు రూ.45లక్షలు రైతుల నుంచి వసూలు చేసినట్టు తేలింది. ఈ డబ్బు మాత్రం మార్క్‌ఫెడ్ సంస్థకు అప్పగించలేదు. మూడేళ్ల నుంచి లావాదేవీలు డబ్బులు ఏకౌంటులో రాక పోవడంతో మార్క్‌ఫెడ్ సంస్థ సభ్యులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా రెండేళ్ల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పూర్తి స్థాయి ఆడిటింగ్ చేసేందుకు అధికారులు రావడంతో ఏకంగా రూ.45లక్షలు దారి మళ్లించినట్టు తేలింది. ఈ విషయంలో బయటికి పొక్కడంతో అధికారులు సర్దుబాటు చేసి రూ.10లక్షలు రికవరీ చేశారు. ఇంకా రూ.35లక్షలు చెల్లించాల్సి ఉంది. ఉన్నతాధికారులు పీఏసీఎస్ లెక్కలు తేల్చాలని నోటీసులను పంపించారు. కాగా రెండేళ్లుగా ఈ దందా కొనసాగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు విచారణ చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమ దందాకు తెర లేపిన అధికారుల నుంచి వెంటనే డబ్బులు వసూలు చేసి రికవరీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం అనుమానం రేకెత్తిస్తోంది. ఈ అక్రమాలు వెల్లడి కావడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణను విచారణ అధికారిగా నియమించారు. రూ.45లక్షల లెక్కలు తేల్చాలని పీఏసీఎస్ బక్కయ్యకు నోటీసులను అందజేశారు.

నోటీసు పంపించాం..

- రబ్బాని, డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆడిట్ అధికారి

దహెగాం పీఏసీఎస్‌లో రూ.45లక్షల గోల్‌మాల్ బాగోతంపై నోటీసులు పంపించాం. ప్రస్తుతం విచారణ చేపడుతున్నాం. పూర్తి ఆధారాలు రాగానే వివరాలు వెల్లడిస్తాం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, మే 21: కాగజ్‌నగర్ పాత్రికేయుడు తిరుపతిపై మైనింగ్ నిర్వాహకులు దాడి చేసిన సంఘటనలో అధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చారిగాంలో ఎలాంటి అనుమతులు లేకున్నా మైనింగ్ నడుపుతున్నారని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన కేసులు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల విశ్వేశ్వర్ రావు, ముత్తు అశోక్, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, ఠాగూర్ విజయ్ సింగ్, గజ్జల లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై విచారణ చేపట్టాలి

- ఆర్డీవోకు ప్రెస్‌క్లబ్ సభ్యుల వినతి

కాగజ్‌నగర్ మే 21: కాగజ్‌నగర్ మండలం చారిగాంలో జేసీబీతో అక్రమంగా మట్టితవ్వకాలు జరుపుతుండగా ఫొటోలు తీసేందుకు వెళ్లిన స్థానిక పాత్రికేయుడు తిరుపతిపై నిర్వాహకులు దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరుపాలని ఆర్డీవో సురేష్‌కు మంగళవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సురేందర్ రావు మాట్లాడుతూ చారిగాంలో అనుమతులు లేకున్నా మైనింగ్ నడుపుతున్నారని, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీవో సురేష్ మాట్లాడుతూ దాడి సంఘటనపై విచారణ జరుపుతామన్నారు. అలాగే అనుమతి లేని మైనింగ్ దందాపై విచారణ జరిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ కరుణాకర్, తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రాలు అందజేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పాత్రికేయుడు తిరుపతిపై దాడికి పాల్పడిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యే వీడియో రిలీజ్ చేశారు. టీడీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ మాట్లాడుతూ పాత్రికేయుడిపై దాడి చేసిన మైనింగ్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

రెబ్బెన: మట్టిదందా విషయంలో ఫొటోలు సేకరించేందుకు వెళ్లిన పాత్రికేయుడిపై దాడి చేసిన నిర్వాహకులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రహమాన్, సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. పోలీసులు వ్యాపారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

సిర్పూర్(టి): పాత్రికేయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని మండలంలోని విలేకరులు తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చింతలమానేపల్లి: కాగజ్‌నగర్ పట్టణంలో పాత్రికేయుడిపై దాడి చేసిన దుండగు లను శిక్షించాలని కోరుతూ చింతలమానేపల్లి ఎస్సై నరేష్‌కు విలేకరులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: పాత్రికేయుడిపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని ఎస్సై, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెంచికలపేట: దుండగులను శిక్షించాలని పోలీసు స్టేషన్‌లో ప్రెస్‌క్లబ్ సభ్యులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెంచికలపేట, మే 21: పెంచికలపేట మండలం లోడ్‌పల్లి గ్రామానికి చెందిన బురుష రమ్య కు ఆస్పత్రి ఖర్చుల కోసం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మంగళవారం రూ.5 వేలు అందజేశారు. రెండు రోజుల క్రితం పాముకాటుకు గురైన రమ్య మంచిర్యాలలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఆయన ఆమెను పరామర్శించారు.

ముఖ్యమంత్రి నిర్ణయం అభినందనీయం

కెరమెరి, మే 21: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనగామ జిల్లాకు సర్దార్ పాపన్న గౌడ్ పేరు పెట్టడం అభినందనీయమని గౌడ సంఘం మండలాధ్యక్షుడు సంజీవ్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హర్షం ప్రకటించారు. బహుజన విప్లవ వీరు సర్వాయి పాపన్నగౌడ్ ఏలిన జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టడం సంతోషకరమని కొనియాడారు. ఆయన వెంట గౌడ సంఘం నాయకులు నర్సాగౌడ్, సునీల్‌గౌడ్, సతీష్, సందీప్, వెంకట్, మాధవ్ తదితరులు ఉన్నారు.

కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

మల్లాపూర్, మే, 21: మండలంలోని ముత్యంపేట గ్రామంలోని వాకిటి గంగవ్వ, మారు రాజశ్రీల ఇళ్లల్లోకి పిచ్చికుక్క చొరబడి దాడి చేసిన ఘటనలో మంగళవా రం ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపి న వివరాల ప్రకారం..గ్రామంలో మధ్యాహ్నం వాకిటి గంగవ్వ అను వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయం లో పిచ్చికుక్క ఇంట్లోకి చొరబడి గంగవ్వ ముఖంపై, ఎదురింట్లో ఉన్న మారు రాజశ్రీ కాళ్లను కొరికి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని వారిని ఆసపత్రికి తరలించారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

మాన కొండూరు, మే 21: మండలంలోని అన్నారంలో మంగళవారం ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. కరీంనగర్ నుంచి మండలంలోని అన్నారం గ్రామానికి వరివిత్తనాలతో వ్యాన్ బయలు దేరింది. అన్నారం గ్రామంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

మహారాష్ట్ర కేంద్రంగా దేశీదారు దందా

- రైల్లో తీసుకొస్తున్న అక్రమార్కులు - అడపాదడపా దాడులతోనే సరి


దేశీదారును పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

కాగజ్‌నగర్, మే 21: దేశీదారు దందా మహారాష్ట్ర కేంద్రంగా యథేచ్ఛగా సాగుతోంది. దేశీదారును మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌తోపాటు ఇతర ప్రాంతాలకు తరలించేందుకు రైలుమార్గం అనువుగా ఉండడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగు తోంది. మహారాష్ట్ర చంద్రాపూర్, బల్లార్షా ప్రాంతాల నుంచి కొందరు సిర్పూరు(టి)కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ మధ్యలో సచ్చులు, డబ్బాల్లో నింపితెచ్చిన వాటిని మార్గ మధ్యలో పడేసి వ్యాపారం చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు అడపాదడపా దాడులు చేసినా ఈ దందాకు బ్రేక్ పడటం లేదు. మహారాష్ట్రకు సరిహద్దునే ఉన్న ఆసిఫాబాద్ జిల్లాలోని చాలాగ్రామాల్లో ప్రస్తుతం దేశీదారు ఏరులై పారుతోంది. దేశీదారు ధర తక్కువగా ఉండటం అధిక మత్తు ఇస్తుండటంతో సరిహద్దు ప్రాం తాల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా కిక్ అధికంగా ఉండటంతో మందు బాబులు దేశీదారు వైపు ఎక్కువ ఆసక్తి చూపున్నట్టు అధికారులే చెబుతున్నారు. ఇక్కడి మద్యం ధరలు అధికంగా ఉండటం కూడా పరోక్షంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు స్మగ్లింగ్‌కు ఊతమిస్తోందన్న ఆరోపణలున్నాయి. కొంత కాలంగా జిల్లా ఎక్సైజ్ యంత్రాంగం దేశీదార్‌పై దృష్టిసారించి స్మగ్లింగ్ జరుగుతున్న మార్గాలపై గట్టి నిఘాపెట్టింది. అయినప్పటికీ స్మగ్లర్లు ఎక్సైజ్ యంత్రాం గాన్ని బురిడి కొట్టించి మరీ జిల్లాలోకి దేశీదారును స్మగ్లిం గ్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. స్థానికంగా తయారీ దారులపై దృష్టిసారించి దాడులు నిర్వహిస్తూ బైండోవర్ లను పెంచుతోంది. దేశీదారు స్మగ్లింగ్, గుడుంబా తయారీ విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ ఇందులో భారీగా జరిమానాలు విధిస్తున్నారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న దేశీదారు(ఫైల్)

దాడులు చేస్తున్నాం..

మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి మద్యం ప్రవేశించకుండా గట్టి నిఘా పెడుతున్నాం. ముమ్మరంగా దాడులు నిర్వ హిస్తున్నాం. నిత్యం రైళ్లను చెక్ చేస్తున్నాం. దేశీదారు దందాను కొనసాగించవద్దు. సిర్పూరు, కౌటాల, బెజ్జూరు ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టాం. తమ సిబ్బందితో నిత్యం దాడులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు పలు కేసులు కూడా నమోదు చేశాం.

- రవి, ఎక్సైజ్ సీఐ కాగజ్‌నగర్

నిలిచిన 'యంత్రలక్ష్మి'



- ఆరేళ్లుగా రైతుల ఎదురుచూపులు
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాల కోసం నిరీక్షణ
- ప్రభుత్వం నిధులు మంజూరు చేయక అన్నదాతల అవస్థలు

"సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను ప్రభుత్వం ఆరే ళ్లుగా ఇవ్వకపోవడంతో రైతుకు వెన్నుదన్ను కరువైంది. ఇటీవల అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా రాయితీ యంత్రాలను అంది స్తుందా అని రైతులు వేచి చూస్తున్నారు.

ఆసిఫాబాద్, మే 21: ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో వ్యవసాయ యాంత్రీకరణ లక్ష్యం నెరవేరడంలేదు. గ్రామాల్లో దుక్కిటెడ్ల స్థానాన్ని ట్రాక్టర్లు ఆక్రమించాయి. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వాడకం పెంచేందుకు గత ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకాన్ని ప్రవేశ పట్టింది. కాగా ఆరేళ్లుగా ఈ పథకం అమలు కావడం లేదు. రైతులకు రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం ఇస్తున్నామంటూ గత ప్రభుత్వం 2018 నుంచి ఇతర రాయితీలను రద్దు చేసింది. వ్యవసాయ కూలీల కొరత తీవ్రమవుతుండగా సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగి పోవడంతో వ్యవసాయ యంత్రాలకు అద్దెలు కూడా పెరిగి పోయాయి. దీంతో రైతులు చాలా అవస్థలు పడుతున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పని ముట్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకుంటుందా అని అన్నదాతలు వేచి చూస్తున్నారు.

పెరిగిన వినియోగం..

కొన్నేళ్లుగా వ్యవసాయంలో యంత్రీకరణ ఒక భాగమైంది. ఇటీవల మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగిస్తున్నారు. హార్వెస్టర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ల వినియోగం కూడా పెరిగింది. కూలీల కొరతను అధిగమించడానికి యంత్ర సాయంతో సాగు చేయడానికి రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయా ధికారులు సదస్సులు అయితే నిర్వహిస్తున్నారు. కానీ రైతులను ప్రోత్స హించడానికి మాత్రం ముందుకు రావడం లేదు. కూలీల కొరతతో సీజన్‌లో అధిక కూలి ఇవ్వాల్సి రావడంతో సాగు ఖర్చు పెరిగింది. పెట్టిన పెట్టుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన సబ్సిడీ పని ముట్లను అందించక పోవడంతో రైతులకు సాగు భారం తడిసి మోపెడవుతుంది. ప్రతి రోజు వివిధ గ్రామాల రైతులు కార్యాలయం వద్దకు రావడం, సబ్సిడీ పని ముట్ల కోసం వాకబు చేస్తుండడం కనిపిస్తోంది. రైతులకు అవసరమైన వ్యవసాయ పని ముట్లు సబ్సిడీపై అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

4,60,196 ఎకరాల్లో పంటలు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,60,196 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనాలు వేశారు. సాధారణ సాగుకు మించి పంటలు సాగయ్యే అవకాశం ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. వీటిలో పత్తి 3.5 లక్షల ఎకరాలు, వరి పంట 59,212 ఎకరాలు సాగవుతుందని అధికారులు అంచనాలు వేశారు. మొక్కజొన్న 742 ఎకరాలు, జొన్న 680 ఎకరాలు, పెసర 1,700 ఎకరాలు, మినుములు 163 ఎకరాలు కంది 38,239 ఎకరాలు సాగవుతున్నట్లు అంచనాలు రూపొందించారు. అలాగే సోయాబీన్ 6,089 ఎకరాలు, మిరప 3,173 ఎకరాలు, వేరుశెనగ 178 ఎకరాలు, ఆముదాలు 10, నువ్వులు 10 ఎకరాలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు.

యంత్రలక్ష్మి పథకం కింద..

గత ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకం కింద రైతులకు ట్రాక్టర్లు, సాగు సామగ్రి, గొర్రులు, నాగళ్లు, డ్రమ్ చక్రాలు, రోటవేటర్లు, కల్టివేటర్లు, కేజ్ వీల్స్ హార్వెస్టర్లు, వరి నాటు యంత్రాలను అందించింది. ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, బీసీలకు 50 శాతం రాయితీ వర్తింపజేశారు. ఇలా మూడేళ్లపాటు ఈ పథకం అమలు చేశాక 2018 నుంచి నిలిపి వేసిం ది. దీంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం యంత్రలక్ష్మి పథకాన్ని మళ్లీ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



ఆరేళ్లుగా రావడం లేదు..: సంతోష్, రైతు, ఆసిఫాబాద్

సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఆరేళ్లుగా రావడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.



ఉన్నతాధికారులకు నివేదిస్తాం..: ఖాదర్‌హుస్సేన్, ఏవో

రైతుల విజ్ఞప్తులను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. గతంలో రాయితీపై వ్యవసాయ పరికరాలతో పాటు ట్రాక్టర్లను ప్రభుత్వం అందించేది. 2018 తర్వాత రాయితీపై పరికరాలు రాలేదు. రైతుల నుంచి డిమాండ్ ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కాగజ్‌నగర్, మే 21: కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి హనుమాన్ ట్రేడర్స్ సమీపంలో మంగళవారం లారీ ఢీ కొని మురళీకుమార్(54) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. భట్టుపల్లి సమీపంలోని హనుమాన్ ట్రేడర్స వద్ద లారీ రివర్స్ తీస్తుండగా, అక్కడే ఉన్న మురళీకుమార్‌ను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. ఈ మేరకు మృతిని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా మురళీకుమార్ మంచిర్యాలకు చెందిన నివాసిగా ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



గోపాల్(ఫైల్)

సిర్పూర్(టి), మే 21: సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన పరమరాజుల గోపాల్(26) మద్యంకు బానిసై తన ఇంట్లో సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై దీకొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్ గత కొద్ది రోజులుగా తరుచూ మద్యం తాగి ఇంటికి రాగా తల్లిదండ్రులు, భార్య మందలించారు. సోమవారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో కుటుంబ సభ్యులు మందలించడంతో తాను చనిపోతానని బెదిరించి ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకున్నాడు. కుటుంబీకులు గమనించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. గోపాల్ తండ్రి నానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పనులు వేగవంతం

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులు
- జూన్ 12లోగా పూర్తి చేసేందుకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)

సిర్పూర్(టి), మే 21: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మంజూరైన పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్న లక్ష్యంతో మండలంలో 37 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కంద ఎంపిక చేసింది. ఇందులో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, మూత్రశాలలు, భవనం మరమ్మతులకు ఒక్కోదానికి రూ. 2 నుంచి రూ.3 లక్షల నిధులు మంజూరు చేసింది. పాఠశాలలు పునఃప్రారంభంవరకు పనులు పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఇంజనీరింగ్ సిబ్బందికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మండలంలో దాదాపు సగం పనులు పూర్తి కాగా మరికొన్ని చోట్ల పనులు ఇంకా పనులు ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎం, సీఆర్పీలకు, మండల విద్యాశాఖాధికారులకు ఎప్పటికప్పు డు ఆయా పనులను పర్యవేక్షిస్తున్నారు. కాగా గత ప్రభు త్వ హయాంలో మన ఊరు మన బడి పథకం కింద పనులు చేపట్టిన బిల్లులు రాలేదని కొన్ని పాఠశాలల కమిటీలు, కాంట్రాక్టర్‌లు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికైనా పాత పనులు పూర్తి అయిన వాటికి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో సోమయ్యను వివరణ కోరగా పాఠశాలలు పునఃప్రా రంభం లోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మే 21: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి 3, 5, 8 తరగతుల గిరిజన బాలికలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ 6వరకు దరఖాస్తులు స్వీకరి స్తామని పేర్కొన్నారు. జూన్ 12న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇందులో 3 సీట్లు పీవీటీజీ తెగకు, 3 సీట్లు ఏజెన్సీ గ్రామాల విద్యార్థులకు, 27 సీట్లు అన్ని గిరిజన తెగల విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతి పదికను భర్తీ చేయనున్నామని తెలిపారు.

డిమాండ్ల సాధనకు పోరుబాట

- అధికారులు పట్టించుకోక పోవడంపై కార్మికుల ఆవేదన - పేరుకుపోయిన ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

కాగజ్‌నగర్, మే 21: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగియటంతో అధికారులు పాలన దిశగా అడుగులు పెడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆందోళనబాట పట్టేందుకు కాంట్రాక్టు కార్మికులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు తొలుత కమిషనర్‌కు సమ్మెనోటీసు అందజేసి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు.

- 141మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు..

కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న 141మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు రూ.2కోట్ల మేర పేరుకుపోయాయి. ఈఎస్ఐకి కార్పొరేషన్ పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకపోవటంతో వారు రెఫర్ కేసులు ఏ మాత్రం చేయటం లేదు. కేవలం చిన్నరోగాలకు మాత్రమే చూస్తున్నారని కాంట్రాక్టు కార్మికులు పేర్కొంటున్నారు. ఇక భవిష్య నిధి డబ్బులు కూడా పెండింగ్‌లోనే ఉండటంతో అత్యవసరంగా డబ్బులు తీసుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కాంట్రాక్టు కార్మికులు 141మంది పని చేస్తుండగా వీరికి నెలవారీగా ఒక్కొక్కరికి జీతాలు రూ.12,000 చెల్లిస్తుండగా, ఇఎస్ఐ, పీఎఫ్ కింద రూ.1200 కట్ చేస్తున్నారు. జీతాల్లో కోత విధించిన డబ్బులు పీఎఫ్ కార్యాలయానికి ఎందుకు పంపించటం లేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్లుగా రూ.2 కోట్ల మేర పేరుకుపోయినట్లు చెబుతున్నారు.. సమస్యపై కమిషనర్ అంజయ్యను కలవగా త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని సూచించారు. కాగా పార్లమెంటు ఎన్నికల రావటంతో పోరు బాటను తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పుడు ఎన్నికలు అయిపోవడంతో పోరుకు సిద్ధమవుతున్నారు.

అధికారులు పెండింగ్ లేకుండా చూడాలి..

-అధికారులు స్పందించి ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు పెండింగ్ లేకుండా చూడాలి. మా వేతనాల్లో ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు కోత విధిస్తూ వాటిని ఆయా సంస్థలకు కట్టడం లేదు. భవిష్యత్తు అవసరాల కోసం పీఎఫ్ వినియోగించుకునే అవకాశాలుండేవి. కానీ ఆ పరిస్థితులు ఏ మాత్రం లేవు. అధికారులు డబ్బుల చెల్లించక పోవడంతో పెండింగ్‌లోనే పడ్డాయి.

- శంకర్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి సరిగా లేదు. అయినప్పటికీ కొన్ని చెల్లిస్తున్నాం. ఇప్పటి వరకు వచ్చి నిధులతో ఈఎస్ఐ కార్పొరేషన్‌కు చెల్లిం చాం. పీఎఫ్ బకాయిలు కూడా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

- అంజయ్య, మున్సిపల్ కమిషనర్

సింగరేణి పంచవర్ష ప్రణాళిక

- టార్గెట్ 100 మిలియన్ టన్నులు
- ఏటా 10 శాతం ఉత్పత్తి వృద్ధి రేటుకు యాజమాన్యం చర్యలు



మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు

గోదావరిఖని, మే 21: సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి విషయంలో భారీ దార్శనికతతో ముందుకు వెళుతున్నది. 2030వరకు సింగరేణి సంస్థ వార్షిక ఉత్పత్తి 100మిలియన్ టన్నులకు చేరుకునే విధంగా పంచవర్ష ప్రణాళికను ఏర్పాటు చేసుకున్నది. ఇప్పటి నుంచి ఏటా 10శాతం వృద్ధి రేటును పెంచుకుంటూ 2030నాటికి 100మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. సీఎండీ బలరాంనాయక్ దిశా నిర్దేశనంలో సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, జీఎంలు, మూడవ శ్రేణి అధికారులు సమి ష్టిగా ఈ ప్రణాళికను ముందుకు తీసుకుపోయేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక ఇల్లందు క్లబ్‌లో రామగుండం, బెల్లంపల్లి, భూపాల పల్లి రీజియన్ల జనరల్ మేనేజర్లు, గని మేనేజర్లు, ఓసీపీల మేనేజర్లు, ఇతర అన్నీ విభాగాల ఉన్నతాధికారులతో సంస్థ డైరెక్టర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ పాల్గొని సంస్థ ముందస్తు ప్రణాళి కను సింగరేణి మూడు రీజియన్ల అధికారులతో సమీక్షించారు.

● వచ్చే ఐదేళ్లలో..

వచ్చే ఐదేళ్లలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణ అంశాలపై వర్క్‌షాప్ నడిచింది. ఈ అన్నీ రంగాల్లో ప్రతి సంవత్సరం 10శాతం వృద్ధి రేటు సాధించేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. 2029-30 సంవత్సరం నాటికి 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే విధంగా ముందుకు పోవాలని డైరెక్టర్లు సూచన చేశారు. అందులో 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచే 10శాతం వృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని, సంస్థ లాభాల్లో కూడా ఈ వృద్ధి కనిపించే విధంగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వారు చెప్పారు. అందు కోసం క్షేత్ర స్థాయి నుంచి కూడా అన్నీ అంశాలపై చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ సం దర్భంగా డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో భవిష్యత్‌లో పెరిగే విద్యుత్ అవసరాల దృష్ట్యా బొగ్గు అవసరాలు ఉంటాయని, అందుకు సింగరేణి సంస్థ ఈ ఐదేళ్లలో 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా వివిధ విభాగాలు రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచుకోవ డానికి సిద్ధం కావాలన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా థర్మల్, సౌర, జియో థర్మల్ ఉత్పత్తిలో కూడా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించే విషయంపై సింగరేణిలోని ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని, పోటీ ప్రపంచంలో ప్రైవేట్ సెక్టార్‌తో సింగరేణి పోటీ పడే విధంగా ఎదగాలన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గిం చుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలన్నారు. ప్రధా నంగా భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశ విద్యుత్ అవసరాల్లో సింగరేణి సంస్థ తన వంతు భాగస్వామిగా ఉండడం సింగరేణీయులకు గర్వకారణమని డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ అన్నారు. ఇదే వర్క్‌షాప్‌లో సింగరేణి 100మిలియన్ టన్నుల భవిష్యత్ బొగ్గు ఉత్పత్తి ప్రణాళిక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 10శాతం వృద్ధి సాధించే విషయాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడం, ఉద్యోగుల హాజరుశాతం పెంచడం, నూతన బొగ్గు గనులను ప్రారంభించుకోవడం, బొగ్గు రవాణా, యంత్రాల పని సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించడం, రక్షణ సూత్రాలు పాటించడం అంశాలపై కూడా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమీక్షలో ఆర్‌జీ-1, 2, 3 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎన్ సుధాకర్‌రావు, కే వెంకటేశ్వర్లు, భూపాలపల్లి జీఎం ఎస్‌డీ హబీబ్ హుస్సేన్, బెల్లంపల్లి రీజియన్ జీఎంలు డీ రవి ప్రసాద్, బీ సంజీ వరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఏ మనోహర్, రవికుమార్, ఎస్‌ఓటూ జీఎం రాం మోహన్, కార్పొరేటర్ జీఎంలు, ఏజెంట్లు, ఏరియా ఇంజనీర్లు, నిట్ ప్రాజెక్టు మేనేజర్లు, ప్రాజెక్టు ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, ఫైనాన్స్, ఐఈడీ మేనేజర్లు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 21: జిల్లాలో 37 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు వెంకటేష్ దోత్రే, బదావత్‌సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, దాసరి వేణు, సబావత్ మోతిలాల్‌లతో కొనుగోలు ప్రక్రియపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ మూడు మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ట్యాగింగ్ చేసిన రైస్ బిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం లక్ష్యాలను కేటాయించామని చెప్పారు. నిబంధ నల మేరకు ధాన్యం తరలిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు, సామగ్రి నిర్వహణపై సంబంధిత తహసీల్దార్‌లు పర్యవే క్షించాలని, పూర్తి వివరాలతో నివే దిక అందించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం ఎగుమతి, దిగుమతి అంశాలలో ఆలస్యం కాకుండా జాగ్రత్త పడుతున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు మండలాల వారీగా అధికారులను నియమించామని తెలిపారు. సమావేశంలో కుమరం భీం, మంచిర్యాల జిల్లాల ఆర్డీవోలు, ప్రత్యేకాధి కారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మే 21: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామ పంచాయతీ ఖప్రి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను డీఈవో అశోక్, టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ ఏఈ శశిధర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో తరగతులు ప్రారంభం అయ్యేలోగా చేపట్టిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామ సమైక్య సంఘాల సభ్యుల సహకారంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ పనులతో పాటు తరగతి గదుల మరమ్మతులు, బాలికల కోసం ప్రత్యేక మూత్రశాలలు పనులు చేపట్టాలని చెప్పారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీలో ఆసిఫాబాద్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులు కుట్టు కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు దుస్తులు అందించేందుకు సిద్ధం చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా దుస్తుల తయారీ కోసం 78 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. అధికారులు ఆయా కేంద్రాలను పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఆసిఫాబాద్, మే 21: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తిచే యాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె జంగయ్య, చావ రవి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేక పోవడంతో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. సకాలంలో సమస్యలను పరిష్కరించడంలో విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. పాఠశాలలు ప్రారంభం కావడానికి ముందే ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఇందురావు, హేమంత్‌సిండె, రమేష్, తిరుపతి, హరీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యను పరిష్కరించాలి



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కాసిపేట, మే 21: కాసిపేట 1వ గనిపై తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు మంగళవారం గని మేనేజర్ భూశంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ కాసిపేట గనిలో గత కొంత కాలంగా సరైన తాగునీరు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. అలాగే బైక్‌లు పార్కింగ్ చేసేందుకు షెడ్లను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి డెబ్బటి తిరుపతి, రామ స్వామి, భరత్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ రైడింగ్ పనుల తనిఖీ

కాసిపేట, మే 21: కాసిపేట 2వ గనిలో మ్యాన్‌రైడింగ్ పనులను మంగళవారం కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నడక భారం తగ్గించేందుకు అన్ని గనుల్లో మ్యాన్‌రైడింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాసిపేట గనిలో మ్యాన్‌రైడింగ్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రఘుకుమార్, రామానందం, రవీందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.